

ఎర్రమట్టి.. కొల్లగొట్టి
కోహీర్ మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు
పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు 5
జేఎన్టీయూలో ఎం-ఫార్మసీ
సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో అడ్మిషన్లు

### జీఎస్టీ బిల్లుల గందరగోళం

# వ్యాపారుల నిర్వాకం

- సిమెంట్, స్టీలు కొనుగోలుకు బిల్లు అడిగితే అదనపు ధర
- వినియోగదారులపై ఒత్తిడి
- కమీషన్‌పై విక్రయం.. ఖజానాకు చిల్లు



మెదక్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిమెంట్, ఉక్కు వ్యాపారం పారదర్శకంగా సాగకపోవడంతో ప్రభుత్వ పాల సీల్లో డొల్లతనం బయటపడుతోంది. కొందరు వ్యాపారులు ప్రభుత్వానికి పన్నుల రూపేణా రావాల్సిన ఆదాయాన్ని అడ్డుకుంటూ వినియోగదారుల హక్కులను కాలరాస్తున్నారు. జీఎస్టీ చట్టం ప్రకారం వస్తు విక్రయాలకు బిల్లు ఇవ్వడం తప్పనిసరి. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ఇంటి నిర్మాణం, మరమ్మతుల కోసం నాలుగైదు బస్తాల సిమెంటు కొనుగోలు చేసే వినియోగదారుడు బిల్లు అడిగితే వ్యాపారులు విసుక్కుంటారు. బిల్లు కావాలంటే జీఎస్టీ చెల్లించాలని షరతు విధిస్తున్నారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసినప్పుడు వినియోగదారుడికి ఎటువంటి హక్కు, రక్షణ ఉండదు. నకిలీ, లేదా కాలం చెల్లిన సిమెంట్ ఇచ్చినా, బరువు తక్కువ ఉన్నా, ధర ఎక్కువ వసూలు చేసినా ఆధారాలు ఉండటం లేదు.

**ఎక్కువ మొత్తాదులో కొనుగోళ్లకు కమీషన్**

కాంట్రాక్టర్లు, పెద్ద వ్యాపారులు వందల టన్నుల సిమెంటు, ఉక్కు కొనుగోలు చేస్తారు. వారికి బిల్లులు ఇస్తున్నా ఆ బిల్లులు మాత్రం అసలు ధర కంటే తక్కువగా చూపిస్తారు. మిగిలిన మొత్తం క్యాష్‌లో తీసుకుంటారు. వధ్యవర్తులు ఈ లావాదేవీలకు కమీషన్ వసూలు చేస్తారు. ఈ విధానం వల్ల కొనుగోలుదారుడు కూడా పన్ను తప్పించుకుని చవకగా సిమెంటు కొనుగోలు చేస్తున్నాననే భ్రమలో ఉంటాడు. కానీ, దీనివల్ల ప్రభుత్వానికి భారీ పన్ను నష్టం జరుగుతోంది. విక్రయానికి బిల్లు ఇవ్వని వ్యాపారులపై జీఎస్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఇప్పటివరకూ ఎలాటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అనేక ఏళ్లుగా ఈ దందా జరిగిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

**తనిఖీలు చేయడానికి సిబ్బంది కొరత**

జీఎస్టీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండడంతో తమకు వస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకోలేకపోతున్నామని అధికారులు చేతులెత్తేస్తున్నారు. జిల్లా కేంద్రమైన మెదక్‌లోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్, సహాయకుడు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పెద్ద కేసుల విషయంలో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి తనిఖీలు చేపడతాయని సమాచారం. చిన్నా చితకా ఫిర్యాదులపై వినియోగదారులు నేరుగా వచ్చి జీఎస్టీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా రాసిస్తే సదరు దుకాణాదారుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది. వినియోగదారులకు మేలు చేకూర్చడానికి ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలను అవకాశవాదులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.




మంత్రి దామోదర్‌తో వైద్య విద్యార్థులతో జగ్గారెడ్డి, డాక్టర్ జగ్గారెడ్డి అని మంత్రి దామోదర్ సంబోధించగానే నవ్వుతున్న జగ్గారెడ్డి, సంజీవరెడ్డి, షెట్కార్

## జగ్గారెడ్డితో మంత్రి దామోదర్ సరదా సంభాషణ

- సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో ఇద్దరు నేతలతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ షెట్కార్
- ఎంబీబీఎస్ విద్యార్థులతో జగ్గారెడ్డి చిట్‌చాట్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇక్కడ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని చూడగానే 'డాక్టర్ జగ్గారెడ్డి' అని సంబోధించారు. దీంతో నవ్వులు విరిసాయి. పలు విషయాలపై సరదా సరదాగా సంభాషణ జరిగింది. ఈ క్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సైతం ఇద్దరు నేతలతో మంతనాలు చేశారు. అనంతరం ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులతో జగ్గారెడ్డి చిట్‌చాట్‌గా చర్చించారు. భవిష్యత్తులో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి సంగారెడ్డి మెడికల్ కళాశాలకు గౌరవం తీసుకురావాలని సూచించారు.

# రాజీలేకుండా నాణ్యమైన వైద్య విద్య

- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు వైద్య సేవలు
- ప్రజల్లో నమ్మకం కలిగించేలా కృషి
- జిల్లాల్లోనే 90 శాతం వైద్యం అందేలా చర్యలు
- ఏడాదిలో నూతన ఆస్పత్రి అందుబాటులోకి తెస్తాం.
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- రూ.483.75 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



సంగారెడ్డిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వైద్య విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.186.6 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాలు, రూ. 23.75 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను గురువారం ప్రారంభించారు. రూ.273.4 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జనరల్ ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు. అనంతరం మెడికల్ కాలేజీ భవనంలోని లెక్చరర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ దవాఖాన్లో వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల్లోనే 90 శాతం వైద్యం సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న అన్ని మెడికల్ కాలేజీల పనులు ఏడాదిలో పూర్తి చేస్తామని, ఖాళీ పోస్టులకు భర్తీ చేస్తామన్నారు. 500 పడకల జనరల్ ఆస్పత్రి ఏడాదిలో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, చింతాప్రభాకర్, మాణిక్‌రావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, అదనపు డీఎంఈ వాణి, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

సంగారెడ్డి రూరల్: పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమానికే కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. జిల్లాలో 39 వేల మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా ఇస్తామన్న తులం బంగారంపై మంత్రిని ప్రశ్నించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 160 సంఘాలకు మెప్మా ద్వారా రూ.25,21,97,000 కోట్ల నిధులు పంపిణీ చేశామని, ఈ నిధులు మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడతాయని కలెక్టర్ ప్రావీణ్య వెల్లడించారు.

**ప్రజా ప్రసార వ్యవస్థ ప్రారంభం**

సంగారెడ్డి క్రైం: సంగారెడ్డి పట్టణంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రజా ప్రసార వ్యవస్థను మంత్రి దామోదర్ ప్రారంభించారు. దీని ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించవచ్చని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల కృషిని అభినందించారు. ఎస్పీ పరితోష్ పంకజ్ పాల్గొన్నారు.

**విజ్ఞాన కేంద్రంగా అందోల్**

జోగిపేట రూరల్/పుల్‌కల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అందోల్ నియోజకవర్గాన్ని విజ్ఞాన భాండగారంగా తీర్చిదిద్దుతానని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో రూ. 22.53 కోట్లు, చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ వద్ద రూ.8.76 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నియోజకవర్గాన్ని విజ్ఞాన భాండగారంగా తీర్చిదిద్దుతానన్నారు. విద్యా సంస్థలకు కావాల్సిన సదుపాయాలను వచ్చే మూడేళ్లలో దశలవారీగా కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు తదితరులు పాల్గొన్నారు.

### దామరచెరువులో

# అక్రమ కట్టడాలపై హైడ్రా పరిశీలన



దామరచెరువు పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారుల బృందం

పటాన్‌చెరు సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరువు పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు వెలసినట్లు వచ్చిన ఫిర్యాదుపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించేందుకు హైడ్రా అధికారుల బృందం గురువారం ఐడీఏబొల్లారం దామరచెరువును సందర్శించింది. చెరువుకు ఆనుకొని ఉన్న మైత్రి లేఅవుట్ వివరాలు తెలుసుకున్నారు. చెరువు పరివాహక ప్రాంతంలోని అక్రమ కట్టడాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరివాహక ప్రాంతాన్ని పూడ్చి విల్లాలు నిర్మించినట్లు ప్రాథమికంగా తేల్చారు. ఇప్పటికే హైడ్రా వెబ్‌సైట్‌లో దామర చెరువులో కట్టిన విల్లాల వివరాలను ప్రదర్శించిన నేపథ్యంలో పూర్తిస్థాయి నివేదిక రూపొందించనున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తామని డీఈఈ అర్చన చెప్పారు. ప్రత్యక్ష పరిశీలన అనంతరం అనుబంధ శాఖల అధికారులు కొలతలు వేసి కూల్చివేతల పనులు చేపడతారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు దేవదాస్, హర్షదీప్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు సాకి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్‌పంకజ్

## శోభాయాత్రలో డీజేలు వద్దు

**ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి : సంగారెడ్డి ఎస్పీ పరితోష్‌పంకజ్**

పటాన్‌చెరు సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలు జరిపే నేపథ్యంలో శోభాయాత్రల్లో డీజే శబ్దాలు లేకుండా చూడాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్‌పంకజ్ ఆదేశించారు. గురువారం పటాన్‌చెరు సాకి చెరువులో నిమజ్జనం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కఠోరమైన శబ్దాలు లేకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శోభాయాత్ర నిర్వహించుకోవాలని కోరారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలపై రంగులు, పువ్వులు పడకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల వద్ద సరిపడా క్రేన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగినప్పుడు రక్షించడం కోసం గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐలు వినాయకరెడ్డి, లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- మెదక్ కొమటూరు చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన



కొమటూరు చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ మండల పరిధిలోని కొమటూరు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఆయన ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారి రవాణా, భద్రతా చర్యలపై దృష్టిసారించాలని సూచించారు

**ఇళ్ల నిర్మాణ వేగం పెంచాలి**

నర్సాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి అవరమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, రూప్‌సింగ్ తండాలో ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పురోగతిని బట్టి దశలవారీగా నిధులు వెంటనే మంజూరయ్యేలా చూస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయాన్ని, రాయరావు చెరువును సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఏఈ మణిభూషణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఫోన్ హ్యాక్ చేసి ఖాతా నుంచి రూ.1.50 లక్షలు మాయం

పటాన్‌చెరు సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ హ్యాక్ చేసి డబ్బులు కొట్టేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పరిశ్రమలో పనిచేస్తున్న నర్సింహులు ముత్తంగి గ్రామంలో నివాసముంటున్నారు. ఆయన బ్యాంకు ఖాతా నుంచి గత నెల 27 నుంచి రూ.50వేల చొప్పున కట్ అయినట్లు మూడుసార్లు మెసేజ్ వచ్చింది. బ్యాంకు అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా ఖాతాను స్తంభింప జేశారు. సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

### బిట్ కాయిన్ పేరుతో టోపీ

పటాన్‌చెరు సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పేరుతో సైబర్ కేటుగాళ్లు మోసం చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీసస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్నాపూర్ పురపాలిక పరిధిలోని చిట్కుల్ గ్రామం రాధమ్మకాలనీలో నివాసముంటున్న భైరవప్రసాద్ ఫోన్‌కు జూన్ 10న బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని మెసేజ్ రావడంతో దానిపై క్లిక్ చేశారు. అనంతరం రోహిత్‌సింగ్ అనే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని, ఆన్‌లైన్ ఖాతా తెరవాలని సూచించారు. తొలుత రూ.7వేలు జమ చేయగా రూ.73,920 లాభం వచ్చినట్లు చూపించారు. డ్రా చేయడానికి రూ.16,992 జీఎస్టీ చెల్లించాలని చెప్పగా జమ చేశారు. అనంతరం పెండింగ్ చార్జీలు అంటూ రూ.41వేలు చెల్లించమన్నారు. అనుమానం వచ్చి ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.



జైనేజీ కాలువను తలపిస్తున్న జిల్లెల వాగు

# కబ్జాల చెరలో వరద కాలువలు

- జిన్నారంలో కొచ్చెరువు వాగు, గడ్డపోతారంలో జిల్లెల వాగు ఆక్రమణలు
- 60 అడుగుల జిల్లెల వాగు.. ఆరు అడుగులకు కుంచించుకుపోయిన వైనం

జిన్నారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి ప్రవాహంతో కళకళలాడాల్సిన వాగులు కబ్జాల బారిన పడి కుదించుకుపోతున్నాయి. 60 అడుగుల విస్తీర్ణం ఉన్న వాగు నేడు ఆరడుగుల పిల్ల కాలువలా మారింది. మరోచోట ఏకంగా వరద ప్రవాహనికి అడ్డుగా కాలువలో పైపులు వేశారు. కాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల మధ్యలో ఉన్న జిల్లెలవాగు కబ్జాల బారిన పడి కుదించుకుపోయింది. రంగారెడ్డి జిల్లా దుండిగల్ పరిధి రాంకీ సంస్థ సమీపం నుంచి జిల్లెలవాగు ప్రారంభమవుతుంది. పారిశ్రామిక వాడల మధ్యలో నుంచి ప్రవహిస్తూ కాజీచెరువు, గండి చెరువుల మీదుగా నక్కవాగులో కలుస్తుంది. పరీవాహక ప్రాంతంలో వెలసిన పరిశ్రమలు వాగును చెరబట్టాయి. మూడు కిలోమీటర్ల పొడగునా 20 వరకు పరిశ్రమలు వాగును ఆక్రమించి భవనాలు, ఫెన్సింగ్, ప్రహరీలు నిర్మించాయి. 50 ఎకరాల వాగు భూములు కబ్జాకుగురయ్యాయి. వీటి విలువ రూ. 100కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇటీవల ఓ రియల్ సంస్థ కాజీపల్లి ఫారెస్టు, ప్రభుత్వ భూముల సమీపంలో జిల్లెల వాగు ప్రవాహాన్ని మార్చి నిర్మాణాలు జరిపినట్లు ఆరోపణలున్నాయి. 180 సర్వే నంబర్‌లో నుంచి ప్రవహించే జిల్లెల వాగును పక్కనే ఉన్న ఫారెస్ట్ భూములను ఆక్రమించి మళ్లించారనే

మిగతా 6వ పేజీలో



ఇటీవల వచ్చిన వరదకు కొట్టుకుపోయిన కొచ్చెరువు వాగులో వేసిన పైపులు

# ‘104’ ఉద్యోగులకు న్యాయం చేయరా?

**● ఉమ్మడి జిల్లాలో 129 మంది సిబ్బంది ● కొందరికి మెడికల్ కళాశాలలో సర్దుబాటు ● మిగతా వారికి పోస్టింగ్‌లు ఇవ్వని ప్రభుత్వం**

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య శాఖలో కీలక సేవలందించే సిబ్బంది బలహీనపడినందువల్ల వైద్యసేవలు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నా అవి సక్రమంగా తెరుచుకోకపోవడంతో మందుల కోసం ప్రజలు పట్టణాల్లోని ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. 2008లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 104 సంచార వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వృద్ధులు, మహిళలకు షుగర్ (మధుమేహం), బీపీ(బ్లడ్ ప్రెషర్) తదితర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం అందించి ఉచితంగా మందులు అందజేసేవారు.



నిలిచిపోయిన 104 వాహనాల సేవలు

104 ఉద్యోగులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 129 మంది వివిధ కేటగిరీల్లో సేవలందించేవారు. ఈ పథంకలో ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్ట్, డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారికి విద్యార్హతలు, క్యాటగిరీల ఆధారంగా వేతనాలు చెల్లించేవారు. 2022లో తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసి 104 వాహన సేవలను నిలిపివేసిన విషయం తెలిసిందే.

అనంతరం 104 పథకంలో పని చేసే ఉద్యోగులను వైద్యారోగ్య శాఖలోని పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జనరల్ ఆసుపత్రులు, తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రాలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌సీడీ క్లినిక్‌లలో వివిధ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చి సర్దుబాటు చేసింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 104 ఉద్యోగులందరికీ న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ కొందరిని డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులను మాత్రమే మెడికల్ కళాశాలలో నియమించాలని ఉత్తర్వులు జారీ చేశారని వాపోయారు.

ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్ట్‌లకు మాత్రం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

### న్యాయం చేయాలి



104 పథకంలో గత 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ పథకంలో పని చేసే డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులను మెడికల్ కళాశాలలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషమే. కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్‌లకు కూడా న్యాయం చేయాలి. 104లో చేసే ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మినిస్ట్రీ)లో పోస్టింగులు ఇవ్వాలి.

-ఎండి.నుస్రత్, 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

## గంజాయి మొక్కలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను నిందితుడిని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వట్‌పల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్న పొలంలో సిబ్బందితో దాడి చేయగా ఎనిమిది లక్షల 90 వేల విలువైన 89 గంజాయి మొక్కలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐసాగర్ రెడ్డి, ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని దరఖాస్తు పల్లి గ్రామానికి చెందిన కలాలి యాదయ్య అనే రైతు పత్తి చేనులో అంతర సాగుగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో బుధవారం సిబ్బందితో దాడి చేసి మొక్కలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సందీప్ సిబ్బంది విక్రమ్, ముఖీమ్, శ్రీధర్, పండరి, నాగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

చిన్నకోడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతి లేకుండా గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో గురువారం తెల్లవారు జామున చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఇసుక టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్‌కు చెందిన టిప్పర్ యజమాని సాయికిరణ్, బెజ్జంకి మండలానికి చెందిన టిప్పర్ డ్రైవర్ శరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎనిమిది మందిపై కేసు

మద్దూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ శిబ్బితండాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ విధులకు ఆటంకపరిచిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌మహబూబ్ అలీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న శిబ్బితండాలో వినాయక మండపం వద్ద డిజే సౌండ్ సిస్టమ్ పెట్టుకోగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ విధులకు ఆటంకపరిచిన కేసులో గురువారం తహసీల్దారు ఎదుట భూక్య అజయ్, పలువరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేర్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన బాలస్వామి తన భార్య మంజులతో కలిసి బైక్‌పై చేర్యాల శివారు గట్టుతోట కాలనీకి వెళ్తున్న క్రమంలో పాతబస్టాండు చౌరస్తా చిట్యాల గ్రామానికి చెందిన అబిలాశ్ బైక్‌పై ప్రయాణిస్తూ ఢీ కొట్టాడు. దీంతో అబిలాశ్, బాలస్వామి, మంజులకు తీవ్రగాయలయ్యాయి.

## ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

శివ్వంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని గురువారం గుర్తు తెలియని దుండగులు అపహరించుకపోయిన సంఘటన బోజ్యాతాండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బోజ్య తండా పంచాయితీ ట్రాక్టర్‌ను తండాలో పార్కింగ్ చేశారు. ట్రాక్టర్‌లో నుంచి బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీని అపరించకపోయారని స్థానికులు తెలిపారు.

## ప్రియుడితో పెళ్లి వద్దనడంతో యువతి ఆత్మహత్య

శివ్వంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వాడితో పెళ్లి వద్దనడంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన పోలీస్ శాఖ ఉద్యోగిమాటలకు మోసపోయిన యువతి కలత చెంది ఆత్మహత్య యత్నం చేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం తాళ్లపల్లి తండాలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని తాళ్లపల్లి తాండాకు చెందిన బానోత్ కేశ్య మూడో కూతురు సక్కుబాయి 21 ఎంబీఏ చదివి ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. సక్కుబాయికి నారాయణఖేటుకు చెందిన కానిస్టేబుల్ సుధాకర్ అలియాస్ సిద్దుతో పరిచయం ఏర్పడి ఇద్దరు ప్రేమించుకున్నారు.

సుధాకర్ సక్కుబాయిని వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాడు. అయితే సుధాకర్ అన్న వరస అవుతాడని పెళ్లి చేసుకోవద్దని సక్కుబాయిని సవితి తల్లి, నాన్న కేశ్య సక్కుబాయిని మందలించారు. అదేవిధంగా ఉద్యోగం మానేయాలని చెప్పడంతో మనోవేదనకు గురైన సక్కుబాయి ఇంట్లో నిలవ గదిలో ఉన్న గడ్డి మందు తాగానని చెప్పడంతో వెంటనే కుటుంబీకులు నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బహదూర్ పల్లి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

## పట్ట పగలే చోరీ

మనోహరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామానికి చెందిన మడుగు పెంటయ్య మనోహరాబాద్ గ్రామంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. గురువారం ఉదయం ఆటోలో పెంటయ్య బయటకు, భార్య ముత్యాలు పనికి వెళ్లగా, చిన్న కుమారుడు ఉదయం కాలేజీకి వెళాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పట్ట పగలే ఇంట్లో ఉన్న తులానికి పైగా బంగారం, 6 తులాల వెండి, 50 వేల నగదును దొంగిలించారు. తన పెద్ద కొడుకు భానుప్రసాద్ మధ్యాహ్నం కాలేజీ నుంచి వచ్చి చూడగా ఇంట్లో సామాను దొంగిలించినట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డాగ్ స్కాడ్‌తో విచారణ చేపట్టారు. చుట్టు పక్కల స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు ఇతర రాష్ట్రల వారు ఇతర సామాన్లు అమ్ముతూ దొంగతనాలకు పాల్పడుతున్నారని ప్రజలు అంటున్నారు.

## అత్యుత్తమ స్థాయిలో ‘108’ సేవలు అందించాలి

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 4 ( ఆంధ్రజ్యోతి): జీవీకే ఈ.ఎమ్.ఆర్.ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ మెదక్ ఉమ్మడి జిల్లాలో 108 సేవలు ప్రభుత్వ సహకారంతో పనిచేస్తున్నాయని జిల్లాలో ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. మెదక్ జిల్లాలో 20, సిద్దిపేట జిల్లాలో 26, సంగారెడ్డి జిల్లాలో 28 అంబులెన్సులు ఉన్నాయని, మొత్తంగా ఉమ్మడి జిల్లాల్లో 74-108 అంబులెన్సులు నిరంతరం ప్రజల సేవలో ఉన్నాయని అన్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ 170, అంబులెన్సు పైలట్స్ 170 మంది ఉన్నారని తెలిపారు. సిబ్బందికి ప్రతి ఆరు నెలలకి ఒక సారి వైద్య సేవలపట్ల మరియు రోడ్డు భద్రత అవగాహనా సదస్సు 6 రోజులు శిక్షణ తరగతులను నిర్వహించి అంబులెన్సు సిబ్బంది యొక్క నైపుణ్యతను మెరుగుపరిచేలా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఈఏంటీ, డ్రైవర్లు

ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ మోటార్ వాహన ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహనా సదస్సు , ట్రైనర్ అరుణ్ కుమార్ పాల్గొని సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో ప్రోగ్రామ్ మేనేజర్ మాట్లాడుతూ ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని, 108 వాహనాల ద్వారా వైద్య సేవలు అందించే క్రమంలో ఆసుపత్రులకు తరలించే సందర్భాల్లో గర్భిణులు ప్రసవించే అవకాశం ఉందని అలాంటి సమయంలో మాతా శిశు మరణాలు జరగకుండా 108 వాహనాల టెక్నీషియన్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. 108 సిబ్బందికి అధునాతన అత్యవసర వైద్య సహాయ పద్ధతులపై శిక్షణ, గర్భిణులకు, క్షతగాత్రులకు వారి ఇంటి నుంచి ఆసుపత్రికి తరలించే క్రమంలో ఎలా వ్యవహరించాలి అన్న వైద్య పద్ధతులపై శిక్షణ, సిబ్బంది మెలకువలు తెలుసుకొని పాటిస్తే మాతా శిశు మరణాల రేటును తగ్గించవచ్చని అన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అధునాతన పద్ధతిలో శిక్షణ పొందాల్సి అవసరం ఉందన్నారు. మాతా శిశు మరణాల రేటు తగ్గించటమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలొ మెదక్ జిల్లాలో మేనేజర్ కే. రవి కుమార్, కిరణ్ కుమార్, జిల్లా వ్యాప్తంగా ఉన్న 108 ఈఎంటీలు, డ్రైవర్లు పాల్గొన్నారు

## కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్

తూప్రాన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో గురువారం వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు బ్లూక్రాస్ సంస్థ సహకారంతో రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. అలాగే, బ్లూక్రాస్ సంస్థ సిబ్బంది వార్డులో పర్యటించి స్టెరిలైజ్ చేయని వీధి కుక్కలను బంధించి ఏబీసీ సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, బ్లూక్రాస్ సంస్థ షెల్టర్ డైరెక్టర్ కుమారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బీభత్సానికి కుళ్లిన పంటలు



కూచన్‌పల్లి శివారులో కుళ్లిపోయిన వరిపంట

హవేళిఘణపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్యజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లి శివారులోని మంజీరానది పరీవాహక ప్రాంతాల్లో 50 ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. పొలాల్లో నీరు నిలిచి వరి కుళ్లిపోయింది. వ్యవసాయ అధికారులు వచ్చి పంటలను పరిశీలించారు. 40 ఏళ్లల్లో మంజీరానదికి ఇంత వరద ఎన్నడూ రాలేదని రైతులు చెబుతున్నారు.

## ప్రజల సహకారంతో నేరాలను అరికట్టవచ్చు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో నేరాలను అరికట్టగలమని ఎస్సై నర్సింలు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు బాధితులకు వారు పోగొట్టుకున్న 3 ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎస్సై నర్సింలు మాట్లాడుతూ..సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

## రికార్డులను పరిశీలించిన ట్రైనీ జేఏలు



డివిజనల్ సబ్ ట్రెజరీ ఆఫీస్‌ను సందర్శించిన ట్రైనీ జేఏలు

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్స్టిట్యూట్‌ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందుతున్నటువంటి జేఏ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని డీఎస్‌టీవోను గురువారం సందర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గల డీఎస్‌టీవోలో ఉద్యోగులకు సంబంధించినటువంటి రికార్డులను పరిశీలించారు. వీరి వెంట కోర్సు ప్యాకల్టీ బాలరాజు, స్థానిక ట్రైనీ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

## వాటర్ హీటర్ ముట్టుకుని బాలుడి మృతి



నోయల్ (ఫైల్)

దౌల్తాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాటర్ హీటర్ ముట్టుకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం దౌల్తాబాద్ మండల పరిధిలోని మాచిన్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దొమ్మాట గ్రామానికి చెందిన గడ్డమీద కరుణాకర్‌కు మండల పరిధిలోని మాచిన్ పల్లి గ్రామానికి చెందిన కీర్తనతో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. దంపతులకు ఇద్దరు కుమారులు. కరుణాకర్ కీర్తన దంపతులు కొన్ని రోజుల నుంచి మాచిన్ పల్లిలో అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నారు. కరుణాకరు ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య కీర్తన ఇంటి వద్ద కిరాణా షాపు నడుపుతుంది. గురువారం సాయంత్రం ఇంట్లో వాటర్ హీటర్ పెట్టగా చిన్న కుమారుడు నోయల్ (4) ఆడుకుంటూ ఆడుకుంటూ వాటర్ హీటర్‌కు తగిలి మృతి చెందాడు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**● మరో ఇద్దరికి గాయాలు**

తొగుట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం ఘనపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తొగుట పోలీసుల కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామానికి చెందిన తిప్పారం సుజాత (45) ఆమె కొడుకు వినీల్‌తో కలిసి సిద్దిపేట నుంచి మోటర్ సైకిల్‌పై చెప్యాలకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఘనపూర్ శివారులోకి రాగానే రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో సడన్ బ్రేక్ వేసి బండిని నిలిపివేయడంతో ఆమె బండి నుంచి కిందికి దిగింది. ఈ క్రమంలో అదే దారిలో వెనుక నుంచి ప్రయాణికులతో వస్తున్న ఏపీ 23 ఎక్స్ 2622 నెంబర్‌గల ఆటో అతి వేగంగా వచ్చి సుజాతను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న ఘనపూర్ గ్రామానికి చెందిన కుంబాల క్రిష్ణవేణి, యాటెల్లి కనకవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఏరియాకు తరలించారు. మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

## విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకే టీఎల్ఎమ్ మేళా

కుకునూరుపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో బచ్చలి సత్తయ్య ఆధ్వర్యంలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ముంద్రాది రమేష్, ఎమ్మార్వో సుజాత ముఖ్య అతిథులుగా విచ్చేసి టీఎల్ఎం మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా అంకితభావంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులు తయారుచేసిన టీఎల్ఎంను విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడతాయని వివరించాలని సూచించారు.


చింతలఘట్టు గ్రామ శివారులోని అసైన్డ్ భూమిలో ఎర్రమట్టి తవ్వకాలు

# ఎర్రమట్టి.. కొల్లగొట్టి

## కోహీర్ మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు

## పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

కోహీర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలంలో అనుమతులు లేకుండానే ఎర్రమట్టి గుట్టలను తవ్వేస్తూ కొందరు అక్రమార్కులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. అక్రమ మైనింగ్, రవాణాపై కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ మండలంలో మాత్రం ఎర్రమట్టి తవ్వకాలు ఆగడం లేదు. మట్టి మాఫియా విచ్చలవిడిగా తరలిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సెలవు రోజుల్లో మరింత జోరు

కోహీర్ మండలంలోని చింతలఘట్టు, వెంకటాపూర్, కవేల్లి, దిగ్వాల్, మద్రి, పిచేర్యాగడి, పైడిగుమ్మల్, సజ్జాపూర్, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల శివారులో జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సెలవు రోజులలో రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. చెరువులు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎక్స్‌కవేటర్లతో మట్టిని ఇష్టానుసారంగా తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సెలవు దినాలలో అధికారులు ఉండరనే ఉద్దేశంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ప్రజలు, రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

### అధికంగా తవ్వకాల ప్రాంతాలు

చింతలఘట్టు గ్రామ శివారు, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అలాగే దిగ్వాల్ గ్రామ శివారు ప్రభుత్వ, ఇతర భూముల్లో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మద్రి గ్రామ శివారు వక్ఫ్ భూముల్లోనూ వదలడం లేదు. పిచేర్యాగడి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల్లో నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతోందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ మట్టి రవాణాను ఆపాలి**



మండలంలో జోరుగా ఎర్రమట్టి రవాణా జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా చర్యలు తీసుకుని వదిలిశారు. శాశ్వతంగా మట్టి రవాణాలను ఆపడం లేదు.

-గాబ్రియల్, దిగ్వాల్

# జేఎన్టీయూలో ఎం-ఫార్మసీ

## సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు


క్యాంపస్‌లో ఏర్పాటైన అధునాతన ల్యాబ్

జోగిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఎం-ఫార్మసీ కోర్సు ప్రారంభంకానున్నది. రెండు కోర్సులకు అనుమతినిస్తూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) ఉత్తర్వులు జారీ చేసింది.

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్ 2003లో బీ-ఫార్మసీ, 2007లో ఎం-ఫార్మసీ (ఫార్మస్యూటికల్ ఎనాలిసిస్) కోర్సులు మొదలయ్యాయి. అక్కడి క్యాంపస్‌లో టెక్నాలజీకి సంబంధించిన ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే బోధించాలన్న నిర్ణయంతో ఎం-ఫార్మసీ విభాగాన్ని ఇక్కడికి తరలించారు. అయితే, రాష్ట్రంలోని ఇతర జేఎన్టీయూ క్యాంపస్‌లలో లేనంత విశాలమైన స్థలం, అది జాతీయ రహదారిని ఆనుకుని సుల్తాన్‌పూర్ క్యాంపస్ ఉండడం, హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న నేపథ్యంలో ఇక్కడికి ఎం-ఫార్మసీ విభాగాన్ని తరలించడం అనువైనదిగా యూనివర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. అంతకుముందు 2021లోనే బీ-ఫార్మసీ విభాగాన్ని ఇక్కడికి తరలించారు. ఒక బ్యాచ్ పూర్తయ్యాకనే ఎం-ఫార్మసీ విభాగాన్ని తీసుకురావలన్న ఉద్దేశంతో ఈయేడు సుల్తాన్‌పూర్ క్యాంపస్‌కు తరలించారు. కౌన్సెలింగ్ ద్వారా ఇక్కడి సీట్లను భర్తీ చేయనున్నారు. ఎం-ఫార్మసీ కోర్సుల కోసం జేఎన్టీయూ యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఫండ్(యూడీఎఫ్) నిధుల నుంచి రూ.2 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో విద్యార్థులు, అధ్యాపకులకు వసతులు, సదుపాయాల కల్పనతోపాటు అధునాతన ల్యాబ్‌లు, అత్యాధునిక పరికరాలు, యంత్రాలను ఏర్పాటు చేశారు.




అధునాతన హెచ్‌పీఎల్‌సీ యంత్రం

### ఈ విద్యా సంవత్సరం రెండు కోర్సులు

ఎం-ఫార్మసీ విభాగంలో మొత్తం నాలుగు కోర్సులుంటాయి. ఎం-ఫార్మసీ (ఫార్మాస్యూటికల్ ఎనాలిసిస్), ఎం-ఫార్మసీ(ఫార్మాస్యూటిక్స్), ఎం-ఫార్మసీ(ఫార్మా కాగ్నస్), ఎం-ఫార్మసీ(ఫార్మా కెమిస్ట్రీ)లలో మాస్టర్స్ డిగ్రీని అందించనున్నారు. ఒక్కో కోర్సుకు 15 చొప్పున సీట్లున్నాయి. అయితే, ఈ ఏడాది మాత్రం కేవలం రెండు కోర్సులనే ప్రారంభించనున్నారు. మిగతా రెండు వచ్చే ఏడాది ప్రారంభంకానున్నట్లు తెలిసింది. ఫార్మాస్యూటికల్ ఎనాలిసిస్, ఫార్మాస్యూటిక్స్ విభాగాల్లో మాత్రమే ప్రవేశాలుండనున్నాయి. పీజీసెట్, జీప్యాట్ పరీక్షల ర్యాంకుల ఆధారంగా ఈ కోర్సుల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. ఈ కోర్సుల కోసం నలుగురు కాంట్రాక్టు అధ్యాపకుల నియామకం పూర్తయ్యింది. దీంతో ఫార్మసీ విభాగానికి సంబంధించి ఒక ప్రిన్సిపాల్ సహా మొత్తంగా 17 మంది అధ్యాపకులు ఉన్నారు. ఫార్మసీ విభాగానికి ప్రముఖ ఫార్మాస్యూటికల్స్ సంస్థ అరబిందో ఫార్మా సహకారం అందిస్తోంది. ఎం-ఫార్మసీ కోర్సుల కోసం సుమారు రూ. 50 లక్షల విలువైన... హై ప్రెషర్/ హై పర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమోటోగ్రఫీ (హెచ్‌పీఎల్‌సీ)పరికరాలను అందజేసింది.

**రెండు కోర్సులకు అనుమతి**



ఫార్మసీ కోర్సుల రెగ్యులేటరీ అథారిటీ అయిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ)కి జేఎన్టీయూ దరఖాస్తు చేసుకోగా, ఎం-ఫార్మసీలో రెండు కోర్సులకు ఈ యేడు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం మరో 2 కోర్సులకూ అనుమతినిచ్చింది. ప్రభుత్వం కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే ఇక్కడ ఎం-ఫార్మసీ విభాగంలో మంజూరైన రెండు కోర్సుల్లో చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం.

- డాక్టర్ ఎం.సునీతారెడ్డి, ఫార్మసీ విభాగం ప్రిన్సిపల్

## కొవిడ్‌ను ముందుగానే అంచనా వేసే వ్యవస్థ

● రూపొందించిన గీతం పరిశోధక విద్యార్థి


మైదం రాజేందర్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వంటి మహమ్మారి వ్యాప్తిని ముందుగానే అంచనా వేయడానికి డీప్ లెర్నింగ్ ఆధారిత ఒక వ్యవస్థను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని పరిశోధక విద్యార్థి మైదం రాజేందర్ అభివృద్ధి చేశారు. టైమ్ సిరీస్ ఫోర్కాస్టింగ్, డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లను ఉపయోగించి కోవిడ్ డేటా విశ్లేషణాత్మక అధ్యయనాన్ని ఆయన విజయవంతంగా పూర్తి చేసినట్లు ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన గణితం, గణాంక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశోధన ఆరోగ్య సంరక్షణ విశ్లేషణల్లో ఆధునిక గణన పద్ధతుల ప్రాధాన్యతను చాటిందని ఆయన పేర్కొన్నారు. గణాంక, డీప్ లెర్నింగ్ నమూనాల కలయికతో ఈ అధ్యయనం రోజువారీ కొవిడ్ సోకిన కేసులను కచ్చితత్వంతో అంచనా వేసిందని డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. ఈ పరిశోధనను గీతం అధ్యాపకులు ప్రొఫెసర్ బీఎం.నాయుడు, డాక్టర్ హర్ష్ కేవీ సమక్షంలో, ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన ప్రొ. వైఎస్.రెడ్డి బాహ్య మూల్యాంకనం చేసినట్లు తెలిపారు.

# తీరని యూరియా వ్యథ






గంటలతరబడి నిరీక్షించి ఓపిక లేక నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద రైతులు, హుస్నాబాద్‌లో రాత్రిపూట..


చేగుంట- మెదక్ రహదారిపై రైతులు ధర్నా

నర్సాపూర్/చేగుంట/మాసాయిపేట/తూప్రాన్/సంగారెడ్డి అర్బన్/ హుస్నాబాద్, సెప్టెంబరు 4 : రైతులకు యూరియా బాధలు ఇంకా తీరడం లేదు. గురువారం సైతం ఎరువు కోసం బారులు తీరారు.

● హుస్నాబాద్‌లో సహకార సంఘ కార్యాలయానికి రైతులు ఉదయమే వచ్చి టోకెన్ల కోసం క్యూలో నిల్చోగా అధికారులు స్పందించకపోవడంతో హన్మకొండ, సిద్దిపేట రహదారిపై బైఠాయించారు. అనంతరం సమీపంలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాత్రి ఆగ్రోస్ కేంద్రానికి లోడ్ రాగా, రాత్రి పొద్దుపోయాక కూడా యూరియా తీసుకునేందుకు ఎగబడ్డారు.

● చేగుంటలో గంటల తరబడి వేచి ఉన్న రైతులకు యూరియా లేదని అధికారులు తెలపడంతో ఆగ్రహించారు. మెదక్ రహదారిపై బైఠాయించారు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి రైతులను సముదాయించి ఆందోళనను విరమింపజేశారు.

● మాసాయిపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఉదయం నుంచే భారీ సంఖ్యలో రైతులు బారులు తీరారు. తమకు ఒకే బస్తా ఇస్తున్నారని, ఎన్నిసార్లు యూరియా కోసం రావాలంటూ రైతులు మండిపడ్డారు.

● నర్సాపూర్ పీఏసీఎస్ వద్దకు ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఎదురుచూసినా యూరియా లభించక రైతులు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడి స్టాక్ వస్తారో తెలియక పీఏసీఎస్ వద్దనే నిరీక్షిస్తున్నారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నదని మహిళా రైతులు మండిపడ్డారు.

● తూప్రాన్ రైతువేదిక వద్ద సోమవారం క్యూలైన్లు కట్టిన రైతులకు బుధవారం టోకెన్లు అందజేయగా, యూరియా తీసుకోడానికి గురువారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర వద్దకు వచ్చారు. రైతులు పెద్దఎత్తున చేరుకోగా పోలీసుల పహారాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా టోకెన్లు ఇచ్చిన వారందరికీ యూరియా పంపిణీ చేశారు.

● అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా రైతు భరోసా ఇచ్చి యూరియా మరిచారని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆయన సంగారెడ్డిలో మాట్లాడుతూ ఒక రైతుకు పది బస్తాల యూరియా అవసరమైతే రెండు మూడు రోజులోకసారి రోజంతా ఎదురు చూస్తే ఒక్క బస్తా ఇస్తున్నారని, ఈ పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యూరియాను రైతులకు కావాల్సినంతగా సరఫరా చేయాలని ఆయన కోరారు.

# ఉత్తమ గురువులకు పురస్కారాలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్/వర్గల్/మర్కుక్/కోహెడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులను ప్రకటించింది. తమ వినూత్న బోధన, విద్యార్థుల సంక్షేమం, సమాజ సేవలో చూపిన అంకితభావంతో ఉపాధ్యాయులకు గుర్తింపు దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

### రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

**మెదక్ జిల్లాలో ముగ్గురు ఎంపిక**



**తారాసింగ్ (ప్రిన్సిపల్, టీజీఆర్ఎస్, మెదక్):** 2000లో పీజీటీ హిందీ ఉపాధ్యాయుడిగా వృత్తిని ప్రారంభించిన తారాసింగ్, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా తీర్చిదిద్దారు. 2016 నుంచి ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్నారు.



**అవుసుల సాయిలు (హెచ్ఎం, గాజులగూడెం ప్రాథమిక పాఠశాల):** పాపన్నపేట మండలం గాజులగూడెం పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న సాయిలు, 1998లో ఎస్‌జీటీగా కెరీర్ ప్రారంభించారు. కవి, గేయ రచయితగా వందలాది పద్యాలను విద్యార్థులకు నేర్పి, సాహిత్య రంగంలో వారిని ప్రోత్సహిస్తున్నారు. 2012లో 'ఓటు చైతన్యం'పై కవితల పోటీల్లో దాశరథి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు.



**రేఖ (ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మెదక్):** 1984లో ఎస్‌జీటీగా విధుల్లో చేరిన రేఖ, తాను చదువుకున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమానికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారు. పేద విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు.

**సంగారెడ్డి జిల్లాలో ఇద్దరికి రాష్ట్రస్థాయి అవార్డు**



**ఎ.విద్యాసాగర్ (హెచ్ఎం, పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్):** విద్యారంగంలో విశేష కృషికిగాను ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న విద్యాసాగర్‌కు ఈ అవార్డుకు ఎంపికయ్యారు.



**వాకిట శ్రీదేవి (స్కూల్ అసిస్టెంట్, అన్నారం జడ్పీహెచ్ఎస్):** 37 ఏళ్లుగా క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తున్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడటం, విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన అందించేందుకు కృషి చేశారు. కండర క్షీణత వ్యాధిగ్రస్థుల సంఘానికి ఆర్థిక సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను చాటారు.

**సిద్దిపేట జిల్లా నుంచి ఇద్దరు**



**బద్దిపడగ రమేశ్ (హెచ్ఎం, మజీద్‌పల్లి జడ్పీహెచ్ఎస్, వర్గల్ మండలం):** 1996లో టీచర్‌గా కెరీర్ ప్రారంభించి, ఇప్పుడు హెచ్ఎంగా పనిచేస్తున్నారు. బీపీఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ హైదరాబాద్ వారు రూపొందించిన ఎడ్యుకేషన్ సాఫ్ట్‌వేరును వినియోగిస్తూ విద్యార్థుల అకడమిక్ స్టాండర్డ్స్‌ను, సాంకేతిక పరిజ్ఞానాలను పెంచడానికి కృషి చేస్తున్నారు. ఐఐటీ మద్రాసు స్కూల్ కనెక్టింగ్ ప్రోగ్రాంలో విద్యార్థులను రిజిస్టర్ చేయించారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలపై యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతున్నారు. 2022 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.



**చిన్న బ్రహ్మయ్య (భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు, దామరకుంట జడ్పీహెచ్ఎస్, మర్కుక్ మండలం):** 23 ఏళ్లుగా విద్యా సేవలు అందిస్తున్న చిన్నబ్రహ్మయ్య కృత్యాధార బోధన, ప్రయోగాల ద్వారా విద్యార్థులను ఆకట్టుకుంటారు. రాష్ట్ర స్థాయిలో 14 సార్లు, జాతీయ స్థాయిలో 3 సార్లు అవార్డులు గెలుచుకున్నారు. 2020లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని అందుకున్నారు.

**రాష్ట్రస్థాయి అధ్యాపక అవార్డులు**



● డాక్టర్ వెల్దండి శ్రీధర్ (అధ్యాపకులు, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ): నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న సిద్దిపేట జిల్లా కోహెడ మండలానికి చెందిన డాక్టర్ వెల్దండి శ్రీధర్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. కవి, కథకునిగా, విమర్శకునిగా ఆయన రాణిస్తున్నారు. అనేక పుస్తకాలు రాసి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు.



● సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డా.సదయకుమార్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. డిగ్రీ స్థాయిలో విద్యార్థులకు బోధనలో ఆధునిక పద్ధతులను అనుసరించినందుకు, అదే విధంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సామాజిక సేవలో వివిధ కార్యక్రమాలలో భాగస్వాములుగా చేసినందుకు అవార్డుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు.

## మెదక్ జిల్లాలో 58 మందికి..

మెదక్ అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 58 మంది టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈవో రాధాకిషన్ గురువారం ఎంపికైన వారి జాబితాను విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో వారికి అవార్డులు అందజేయనున్నారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు.. జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు రవికుమార్, ఉమాదేవీ, వాణిశ్రీ, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, రాజరత్నం, శంకరయ్య, చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీఎస్ టీచర్లు సుమంగళ, బాబా, లావణ్య, శివకుమార్, సిద్ధయ్య, శిరీష, కవిత, నర్సింలు, నాగరాజు, మల్లేశం, చంద్రశేఖర్ యాదవ్, స్రవంతి, లింగం, సాయిలు, విజయలక్ష్మీ, రాంబాబు, శ్రీవాణి, ప్రవళిక, వసంత్, సంతోష్‌కుమార్, నవీత, ప్రకాశ్, సాయిరెడ్డి, సుందరి, మల్లేశం, ఇంతియాజ్ అలీఖాన్, జీహెచ్ఎస్ నర్సాపూర్ టీచర్ రహిమున్నీసా బేగం, టీజీఎంఎస్ నుంచి శ్రీవాణి, రామేశ్వరి, కేజీబీవీ టీచర్లు శ్రీలత, రాధిక

## సంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు 102 మంది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ మొత్తం 102 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ మేరకు డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ఈ జాబితాను విడుదల చేశారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డులను అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన వారు.. ప్రధానోపాధ్యాయులు రమాదేవి, బాలయ్య, వెంకటరాజయ్య, సంజీవరావు, కందర్ప, కృష్ణారెడ్డి, గోపాల్, సత్తుగౌండ, టీజీఆర్ఎస్ ప్రిన్సిపాల్ సురేఖ, శ్రీదేవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, ఎల్ఎఫ్‌హెచ్ఎం విభాగం సాంబశివుడు, ఆనంద్‌కుమార్, టీజీఎంఎస్ పీజీటీ శంకరయ్య, అరవిందఘోష్, టీజీఎంఎస్ టీజీటీ నాగేందర్, స్కూల్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, నర్సింహులు, మల్లయ్య, మల్లికార్జున్, కిషన్, చంద్రయ్య, మంజుల, అహ్మద్అలీ, షకీల్, తిరుపతిరావు, యశ్వంత్, రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి, రాజు, సుధాకర్‌రెడ్డి, హరిశంకర్, వెంకటకృష్ణ, మురళీధర్, విఠల్, సరస్వతి, నర్సింహులు, ఇందిరాదేవి, శ్రీనివాస్, ఆరిఫ్ అహ్మద్, మాణిక్యరెడ్డి, కె.టి.నాయక్, గీతాకుమారి, కమలాకర్‌రావు, విఠల్‌నాయక్, పాండు, మనోహర్, మోతీలాల్, సరిత, అథర్ అంజుమ్, కనకరాజు, ఖాజానిజామోద్దీన్, ప్రభావతి, జ్యోతి, గోవర్ధన్, భాస్కర్‌రెడ్డి, రాములు, బాలకృష్ణ, బస్వంత్‌రావు, దేవికిషన్ తాన్వి, సెకండరీ గ్రేడ్ టీచర్లు జయశ్రీ, జనార్దన్, రవీందర్, సునీత, వినోద్‌కుమార్, లక్ష్మి, రాజేశ్వర్, ప్రదీప్‌కుమార్, ఈశ్వరమ్మ, ఉమాదేవి, హన్మంతు, శ్రీనివాస్, లీలావతి, అనిత, మహబూబ్‌అలీ, నర్సింహులు, లక్ష్మణ్, నర్సింహులు, త్రివేణి, ప్రసాద్, ఆనంద్, వసంత్, తులసిరావు, సూర్యకాంత్, విఠల్, సోమశేఖర్, తులసి, జ్యోతి, ప్రసాద్, శ్రావణి, దీప్తి, జయకృష్ణ, సునీత, నారాయణరావు, మెరాజ్ సుల్తానా, అబ్దుల్ కరీం, స్వప్న, సునీత, సిద్ధేశ్వరి, కేజీబీవీ సీఆర్‌టీలు శ్రీదేవి, అన్నపూర్ణ, పీజీ సీఆర్‌టీ కవిత.

## సిద్దిపేట జిల్లాలో 55 మందికి..

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. 55 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జడ్పీహెచ్ఎస్‌ల నుంచి కె.రవి, ఆర్.కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కె.రమేష్, రవీందర్‌రెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, రాకేష్‌రెడ్డి, సిహెచ్.వెంకట్రాంరెడ్డి, జి.వెంకటేశం, పద్మజ, వెంకటేష్, జ్యోతి, నీలం శ్రీనివాస్, పి.కృష్ణారెడ్డి, ఆర్.రాజేందర్, వి.శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటేశం, ఎం.మోహన్, కె.విఠల్, ఎల్లయ్య, ఉమారాణి, ధర్మాగౌడ్, శ్రీధర్, పి.కృష్ణప్రసాద్, ఎన్.విజయరేఖ, డి.నరసింహారెడ్డి, ఎంపీపీఎస్‌ల నుంచి ఎ.జయప్రకాష్, లింగయ్య, అరుణ, బి.వేణుగోపాల్, ఎన్.బాలరాజు, పి.రవీందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఎ.రాజేశ్వర ప్రసాద్, ఆర్.అశోక్, నరేష్, జి.ఉమారాణి, కె.అనిల్‌కుమార్, కె.రామ్‌రెడ్డి, ఎస్.నరసింహ, పి.శ్రీనివాస్, షేక్ అబ్దుల్, కె.వాణి, వరలక్ష్మి, గణేష్, మోడల్ స్కూల్ టీచర్లు రజిని, బాబు.బి, యూపీఎస్ టీచర్లు ఎస్.స్రవంతి, ఎంవి జ్యోతి, సిహెచ్.మధు, నస్రిన్, జి.శంకర్, కేజీబీవీ నుంచి ఎల్.వరలక్ష్మి.

## ఆర్వోబీకి భూమి పూజతో నెరవేరిన చిరకాల వాంఛ

● వడియారం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు

● మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు


వడియారం ఆర్వోబీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మ

చేగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేగుంట, శంకరంపేట, మెదక్ గ్రామాలకు వెళ్లే ప్రజలు రైల్వే క్రాసింగ్ వద్ద బ్రిడ్జి లేక అనేక ఇబ్బందులు పడ్డారని, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక మేరకు ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణ పనులకు భూమి పూజ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్వోబీకి నిధులు మంజూరైనా, రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం నిధులు విడుదల చేయకపోవడంతో దశాబ్దకాలంగా నిర్మాణం పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. గురువారం చేగుంట మండలం వడియారంలోని 228వ రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులకు రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్వోబీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరితే, తమ వద్ద నిధులు లేవని చేతులెత్తేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారంతో వడియారం ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన రూ.48.77 లక్షల నిధులు మంజూరయ్యాయని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రూ.3,800 కోట్లతో ముథోల్ నుంచి కర్నూలు జిల్లా డోన్ వరకు రైల్వేలైన్ డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగానే వడియారం రైల్వేస్టేషన్‌లో అదనంగా మరో ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తాను ఎంపీగా గెలిచిన అనతి కాలంలోనే నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. చేగుంట, శంకరంపేట మండలాల్లోని పరిశ్రమల్లో బీహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చిన అనేకమంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి సౌకర్యార్థం వడియారం రైల్వే స్టేషన్‌లో దేవగిరి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేలా కృషి చేయాలని డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మను కోరారు. రైల్వే డీఆర్ఎం సంతోష్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఎంపీ రఘునందన్‌రావు, మండల ప్రజల కోరిక మేరకు వడియారం రైల్వేస్టేషన్‌లో పది రోజుల్లో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవగిరి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలకు కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేగుంట, మాసాయిపేట, చిన్న శంకరంపేట మండలాల బీజేపీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, నాగేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, మహిళా అధ్యక్షురాలు లావణ్య, బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### కోహీర్ తహసీల్దార్‌గా సుప్రియ

కోహీర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ తహసీల్దార్‌గా సుప్రియ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన బాలశంకర్ మేలో బదిలీపై హైదరాబాద్‌లోని బహదూర్‌పురా మండలానికి వెళ్లారు. మే నుంచి సెప్టెంబరు 3వ తేదీవరకు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న వరప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీసీఎల్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన సుప్రియ బదిలీపై కోహీర్‌కు వచ్చారు.

### ఖేడ్ కార్మికశాఖ సహాయ అధికారిగా యాదయ్య

నారాయణఖేడ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ కార్మికశాఖ సహాయ అధికారిగా యాదయ్య, జూనియర్ అసిస్టెంట్‌గా జయక్రిష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వర్తించిన అధికారి గిరిరాజ్ అవినీతికి పాల్పడడమే కాకుండా పనుల కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు బాధితులు ఆందోళన చేశారు. గతనెలలో ఉన్నతాధికారులు విచారణ జరిపారు. నివేదిక ఆధారంగా గిరిరాజ్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్ సాయిలు, అటెండర్ నర్సింలును మూడురోజుల క్రితం ఒకేసారి సస్పెండ్ చేశారు. దీంతో వికారాబాద్ జిల్లా నుంచి యాదయ్యను ఇన్‌చార్జి సహాయ కార్మిక అధికారిగా, గజ్వేల్ నుంచి జయక్రిష్ణను జూనియర్ అసిస్టెంట్‌గా డిప్యూటేషన్‌పై నియమించడంతో వారు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

### ఉచిత వైద్య శిబిరం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో వారోత్సవాల సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ ఇన్‌చార్జి బాలరాజు మాట్లాడుతూ జీవితబీమా వారోత్సవాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రకాష్, ఏవోలు రఘునందన్‌రావు, సౌమ్య, గీత, కవిత, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### కార్మికుల వేతనాలు చెల్లించాలి

మనూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులు అన్నారు. ఈ విషయమై గురువారం వారు మాట్లాడుతూ వేతనాలు లేక తమ ఇల్లు గడవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాలుగునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని వారు కోరారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పాపన్నపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు అన్నిరంగాల్లో పోటీల్లో రాణించాలని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి అన్నారు. పాపన్నపేట గ్రామానికి చెందిన నవయువ సేవా సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

### విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

చేగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలని జియోటెక్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం చేగుంట మండలం చిత్రోజిపల్లి జియోటెక్ పర్సనల్‌లో 40 విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, నార్సింగ్ ఎంఈవో గంగాబాయ్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణ అవసరం

తూప్రాన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాటిన మొక్కలను రక్షించి పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ పట్టణ ప్రాథమిక పాఠశాలలో 75వ వన మహోత్సవం హెచ్‌ఎం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటారు.

### కార్మికుల వేతనాలు చెల్లించాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి, అధికారికి వినతిపత్రం అందజేశారు.

# పనిచేయని టైమర్లు

- అస్తవ్యస్తంగా వీధిదీపాల నిర్వహణ
- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు




పట్టణంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన టైమర్, విద్యుత్ సామగ్రి బాక్సులు

జహీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలువార్డుల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2017-24 వరకు ఏడేళ్లపాటు ఈఈఎస్ఎల్( ఎమర్జెన్సీ ఎనెర్జీ లిమిటెడ్ సర్వీస్) అనే సంస్థకు చెందినవారు పట్టణంలో వీధిదీపాల నిర్వహణ చేపట్టేవారు. పట్టణంలో 37 వార్డులకు వారు అప్పట్లో 280 టైమర్లను ఏర్పాటు చేసి.. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా చూసేవారు. ఒక్కో టైమర్ కింద 30-50 లైట్ల వరకు ఉంటాయని అధికారుల ద్వారా తెలిసింది. ఆయా స్తంభాల వద్ద అమర్చిన టైమర్లు అప్పట్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వాటంతట అవే బంద్ అయ్యేవి. అయితే ఆ సంస్థ గడువు ముగియడంతో మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు వీధిదీపాల నిర్వహణ చేపడుతున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో అమర్చిన టైమర్లు పనిచేయకపోవడంతో రేయింబవళ్లు వీధిదీపాలు వెలుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఉదయం బంద్ చేయడం, సాయంత్రం కాగానే ఆన్ చేసుకుంటున్నామని ఆయా వార్డుల ప్రజలు పేర్కొంటున్నారు. నిరంతరం వీధిదీపాలు వెలుగడంతో విద్యుత్ బిల్లు కూడా అధికంగానే వస్తున్నందున మున్సిపల్‌పై భారం పడనున్నదని తెలిపారు. వివిధ వార్డుల్లో పరిస్థితిని బట్టి ఒక్కో రకమైన 24-190 వాట్స్‌ను కలిగిన లైట్లను ఏర్పాటు చేశారు. లైట్ల ధరలు బాగానే ఉన్నప్పటికీ నాసిరకం కంపెనీలకు చెందిన వాటిని వాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి విచారణ చేసి, వీధిదీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పస్తాపూర్‌కమాన్ సమీపంలో విద్యుత్ స్తంభం వద్ద వైరు తేలడంతో ప్లాస్టిక్ కవర్‌తో చుట్టిన దృశ్యం

#### వారంరోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

వారంరోజుల్లో వీధిదీపాల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నాం. నాసిరకం విద్యుత్ లైట్లు సరఫరా జరుగుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు చూయించిన కంపెనీల బల్బులనే వాడుతున్నాం. గతంలో ఈఈఎస్ సంస్థవారు నిర్వహించేవారని, వారి కాలపరిమితి ముగియడంతో మున్సిపల్ సిబ్బంది చేపడుతున్నారు. టైమర్లను త్వరలో మరమ్మతులు చేస్తాం.

- దీప్తిచంద్, మున్సిపల్ డీఈఈ

## కుటుంబ సంక్షేమం అందరికీ ఆదర్శప్రాయం

నారాయణఖేడ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'ఒక్కరి కోసం అందరూ...అందరి కోసం ప్రతి ఒక్కరూ' అనే నినాదంతో టీఎస్‌యూటీఎఫ్ నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మనూరు మండలం రాణాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మేకల శివకుమార్ జూన్ 13న మృతిచెందారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కుటుంబ సంక్షేమ నిధి ద్వారా రూ.6 లక్షల చెక్కును శివకుమార్ కుటుంబీకులకు అందజేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి మాట్లాడుతూ 2023 మే 2న తమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమనిధి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆకస్మికంగా మృతిచెందిన 46 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున రూ.2.76 కోట్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, కార్యక్రమ జిల్లా కన్వీనర్ సాయితేజ, జిల్లా, డివిజన్ పాల్గొన్నారు.



ఖేడ్‌లో ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

#### మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నేడు నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించనున్నందున ఏర్పాట్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి గురువారం పరిశీలించారు. పట్టణ శివారులో అర్బన్‌పార్కు స్థలాన్ని జిల్లా అటవీఅధికారి శ్రీధర్‌రావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి అనురాధతో కలిసి పరిశీలించారు. అనంతరం కన్వెన్షన్‌హాల్‌ను, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల కోసం మా ఫంక్షన్‌హాల్‌ను, రింగ్‌రోడ్డు వద్ద పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్‌చౌహాన్, నాయకులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావుపై విమర్శలు విచారకరం

నర్సాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నిస్వార్థ నాయకుడని, ఆయనను బలహీన పరిచేలా వ్యాఖ్యలు చేయడం విచారకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరులకు పంపిన ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. కేసీఆర్‌కు హరీశ్‌రావు కుడిభుజం లాంటివాడని, బీఆర్ఎస్‌కు నిజమైన సంపదన్నారు. కేసీఆర్ చెప్పిన ప్రతీ పనిని నిస్వార్థంగా చేసి కార్యకర్తగా, నేతగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా అందరికీ అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా పనిచేశారన్నారు.

## 'పది'లో మంచి ఫలితాలు సాధించాలి



5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయురాలు గణిత బోధన తీరు గమనిస్తున్న డీఈవో

కొండాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. గురువారం తొగర్‌పల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరు, పాఠశాలల గదులు, సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని గమనించిన డీఈవో ఉన్నత పాఠశాల గదుల్లో విద్యార్థులకు బోధన కొనసాగించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంఈవో దశరథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మార్డి పెద్దచెరువు వద్ద రైతుల ఆందోళన

- ఎఫ్‌టీఎల్ కబ్జా భూమిలో సర్వేను అడ్డుకున్న రైతులు



కల్హేర్ మండలంలోని మార్డి పెద్ద చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఆయకట్టు రైతులు

కల్హేర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి కట్టలు వేసి చెరువు భూమి కబ్జాకు పాల్పడిన స్థలంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేను ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. కబ్జాకు పాల్పడిన గోవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి తనకు పట్టా అక్కడే ఉందని భూమి చూపించాలని ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోగా గురువారం కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, సర్వేయర్ ప్రభాకర్, కల్హేర్ ఎస్‌ఐ, సిబ్బంది బందోబస్తుతో సర్వేకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు తమకు 6న సర్వే నిర్వహిస్తామని తెలిపి గుట్టుచప్పుడు కాకుండా ఈరోజు సర్వే చేయటమేమిటని పేర్కొంటూ నారాయణఖేడ్‌లోని సబ్ కలెక్టర్ ఉమాహారతిని కలిసి పరిస్థితిని వివరించారు. రెవెన్యూ అధికారులు మాత్రమే సర్వే చేయటమేమిటని, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సర్వే చేయాలని తహసీల్దార్‌కు సబ్ కలెక్టర్ సూచించడంతో సర్వేను నిలిపివేశారు. సాయంత్రం వరకు నీటిపారుదల శాఖ ఈఈ సుందర్, డీఈఈ జలందర్, ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డిలతో పాటు సర్వే సిబ్బంది మార్డి పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. ఎఫ్‌టీఎల్‌లో మట్టి కట్టలు వేసి కబ్జాకు పాల్పడిన ప్రదేశాన్ని ఈఈ, అధికారులు పరిశీలించారు. పట్టా భూమి ఉన్నా నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్‌లో కట్టలు వేయకూడదని గోవర్ధన్‌రెడ్డికి ఈఈ సుందర్ సూచించారు. 6న సర్వే చేస్తామని అధికారులు తెలపడంతో రైతులను ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి సముదాయించి పంపించేశారు.

## కాంగ్రెస్ నాయకుల సవాల్‌ను స్వీకరిస్తా

టేక్మాల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరతపై కాంగ్రెస్ నాయకులు చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని, దమ్ముంటే గురువారం సాయంత్రం 5 గంటలకు టేక్మాల్ చౌరస్తాలోని జయశంకర్ విగ్రహం వద్దకు కాంగ్రెస్ నాయకులు రావాలని బీఆర్ఎస్ యూత్ జిల్లా కార్యదర్శి కోటి భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన టేక్మాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టేక్మాల్ మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా స్టాక్ ఉంటే చూపించాలని, యూరియా ఉంటే ముక్కు నేలకు రాస్తామన్నారు.

## కళలను వెలికి తీయాలి: ఎంఈవో

హవేళిఘణపూర్/పాపన్నపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికితీయాలని ఎంఈవో మధుమోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కళాఉత్సవ్‌లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏక పాత్రాభినయం, చిత్రలేఖనం, మిమిక్రీ, నృత్యం పోటీలు నిర్వహించి, గెలిచినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సృజన, కరుణాకర్, ఉపాధ్యాయులు సంతోష్, రాజేశం, సత్యనారాయణ పాల్గొన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి కళాఉత్సవ్ పోటీలను ప్రారంభించారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి : రాజిరెడ్డి

శివ్వంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా పుడతారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట, చండి, రత్నాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రాజిరెడ్డి సొంత నిధులతో గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం : ఎంఈవో



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో జాఫర్‌అలీ

జహీరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం అభిస్తుందని మండల విద్యాధికారి జాఫర్‌అలీ పేర్కొన్నారు. గురువారం మొగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరి గ్రామంలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు.

#### ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడలు

జిన్నారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ముగిశాయి. మూడురోజులుగా జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో 23 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ నిర్వహించారు. తహసీల్దార్ దేవదాస్, ఎంఈవో కుమారస్వామి బహుమతులు అందజేశారు.

#### ఖోఖో, కబడ్డీలో సెయింట్‌లో అంథోనీస్ విద్యార్థుల ప్రతిభ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన మండలస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీల్లో శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ విద్యార్థులు ప్రతిభకనబర్చారు. అండర్-14 బాయ్స్ ఖోఖోలో శ్రీచంద్, ముస్తఫా, హర్షవర్ధన్, మాజిద్, అండర్-17 విభాగంలో జుబేర్ సత్తాచాటారు. అదే విధంగా అండర్-17 కబడ్డీ విభాగంలో అభిలాష్, గణేశ్, అవినాష్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని విద్యాసంస్థల అధినేత సాల్మన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణరెడ్డి, డైరెక్టర్లు విజయ్‌కుమార్‌రెడ్డి, జయబాలరెడ్డి, కోచ్ ప్రతాప్, రాథోడ్ అభినందించారు.



## ఒకేసారి గణనాథుల నిమజ్జనం



నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో ప్రతిష్ఠించిన వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

నర్సాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించే వినాయకులను నిర్వాహకులు ఎవరికి ఇష్టమున్న రోజు నిమజ్జనం చేస్తుంటారు. కానీ నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో ప్రతిష్ఠించిన వినాయకులన్నింటినీ ఒకేసారి నిమజ్జనానికి తరలించారు. గురువారం రుస్తుంపేటలో ప్రతిష్ఠించిన 16 మండపాల్లోని వినాయకులను మధ్యాహ్నం ప్రత్యేక వాహనాల ద్వారా సమీపంలోని చెరువుకు తరలించి, నిమజ్జనం చేశారు.

## రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు విద్యార్థులు



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన మదూర్ హైస్కూల్ విద్యార్థులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసన పోటీలకు చిన్నశంకరంపేట మండలం మదూర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లి నరేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేగుంటలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ యోగాసన పోటీల్లో మదూర్ హైస్కూల్ విద్యార్థులు రాజమల్లు, పీ.అశ్వంత్, సాయిచంద్ ప్రతిభ కనబరిచారు. నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## కబ్జా చెరలో వరద కాలువలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. కాజీపల్లి గ్రామ శివారులో వాగు భఫర్ జోన్‌లో ఓ రియల్ సంస్థ కార్యకలాపాలు చేపట్టగా స్థానికులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అదే విధంగా గడ్డపోతారం పరిధిలో పరిశ్రమలకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద వాగును మట్టితో నింపి కబ్జాల కోసం స్కెచ్ వేశారు.

#### కొచ్చెరువుదీ ఇదే పరిస్థితి

జిన్నారం అక్కమ్మ చెరువుకు ఆదెరువు అయిన కొచ్చెరువు వాగు కబ్జాల బారిన పడింది. చెరువు సమీపంలో అటవీ ప్రాంతం నుంచి ఉన్న కాలువనును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం, పైపులు ఏర్పాటు చేయగా ఇటీవలి వరద ప్రవాహనికి కొట్టుకుపోయాయి. దీనిపై ఆగస్టు 18న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవటం లేదని మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వెంటనే ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి జిల్లెలవాగు, కొచ్చెరువు కాలువలను రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు



వినాయకుడికి నివేదించిన 108 రకాల నైవేద్యాలు

జోగిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మనరాష్ట్రంలో దేవుళ్లకు కొన్ని పదార్థాలు వండి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. అదే ఉత్తర భారతంలో జన్మాష్టమి తదితర పండుగలను పురస్కరించుకుని శ్రీక్రిష్ణుడికి 'ఛప్పన్ భోగ్' పేరిట 56 రకాల తినుబండారాలతో నైవేద్యం పెడుతారు. అయితే జోగిపేట పట్టణంలోని బృందావన్ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ మండపం వద్ద వెరైటీగా 108 రకాల తినుబండారాలను నైవేద్యంగా సమర్పించడం విశేషం. ఆ కాలనీకి చెందిన మహిళలంతా తమ తమ ఇళ్లల్లో ఒక్కో పదార్థం చొప్పున వండి, 108 రకాలైన తినుబండారాలను వినాయకుడికి నివేదించారు.

## పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ

కల్హేర్/సిర్గాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సదుపాయం, సిబ్బంది పనితీరు, హాజరు గురించి వైద్యాధికారి ప్రతిభను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వైద్యమందించాలని సంధ్యారాణి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, జట్ల బాస్కర్, రఘు, రాంచందర్ పాల్గొన్నారు.

## ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో వైద్యులేరి?

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డిస్పెన్సరీల్లో వైద్యులు లేక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం ఈఎస్ఐ ఎదురుగా నిరసన తెలిపిన అనంతరం సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు, ఇస్నాపూర్, ఘన్‌పూర్, ఐడీఏబొల్లారం, గుమ్మడిదల గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని వివరించారు. మందులు అందుబాటులో ఉండటం లేదని చెప్పారు. బీపీ, షుగర్, పారాసిటమాల్ వంటి ట్యాబ్‌లెట్‌లు సైతం రోగులకు ఇవ్వడం లేదని అన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో ఈఎస్ఐ కి చెల్లించడానికి 4శాతం కట్ చేసుకొని జీతాలు ఇస్తున్నారన్నారు. అన్ని డిస్పెన్సరీలకు సొంత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిరాజు, గంగాధర్, చంద్రకిరణ్‌సింగ్, రామచంద్రామూర్తి పాల్గొన్నారు.

## అధికారులను సస్పెండ్ చేయాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పట్ల దుర్భాషలాడిన కంగ్టి ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో సుభాష్‌ను సస్పెండ్ చేసి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. రెండురోజుల క్రితం వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా కులం పేరిట దూషించి దురుసుగా ప్రవర్తించారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా, డివిజన్ నయకులు నర్సింలు, విద్యాసాగర్, రమేష్, సతీష్, అంజయ్య, ఎల్లయ్య, తుకారం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదపుటంచున గంగాపూర్ ప్రాజెక్టు

- కోతకు గురైన కట్ట, భయంభయంగా ఆయకట్టు రైతులు



కోతకు గురైన ఖేడ్ మండలం గంగాపూర్ ప్రాజెక్టు కట్ట

నారాయణఖేడ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఉధృతంగా వరద నీరు రావడంతో నారాయణఖేడ్ మండలం గంగాపూర్ ప్రాజెక్టు కట్ట ఒకవైపు కోతకు గురైంది. ప్రమాదం పొంచి ఉండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ర్యాకల్-గంగాపూర్ గ్రామాల మధ్య ఉన్న గంగాపూర్ ప్రాజెక్టు ద్వారా దాదాపు 300 ఎకరాల వరకు భూమి సాగులో ఉంటుంది. ఇటీవల భారీ వర్షాలు కురియడంతో ఎగువ నుంచి వరదనీరు ఉధృతంగా రావడంతో ప్రాజెక్టు అలుగు పలుమార్లు పారింది. గురువారం ప్రాజెక్టు కట్ట ఒకవైపు కోతకు గురికావడంతో ఎప్పుడు తెగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఈఈ సుందర్‌ను పలుకరించగా, గంగాపూర్ కట్ట కోతకు గురైన విషయం తమ దృష్టికి వెంటనే తాము కట్టను సందర్శించామన్నారు.

## ఈత చెట్లు నాటిన ఎక్సైజ్ అధికారులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని నల్ల చెరువుకట్టపై ఇరుపక్కల ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృత్తిదారులకు ఆజ్యం పోసేలా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, డిప్యూటీ కమిషనర్ హరికిషన్ సహకారంతో సొసైటీకి 1800 ఈత మొక్కలు పంపిణీ చేశారన్నారు.